# అప్పుడప్పుడూ సెంటిమెంట్!

చిదంబరం తన నిర్ణయం చెప్పేశాడు.

అక్కడ కూర్చున్న వాళ్ళంతా చేతులెత్తి దణ్ణం పెట్టాడు. వెంకట్రావ్ "మిమ్మల్ని రక్షించు మహాప్రభో. మా పెళ్ళాం పిల్లలు వీధిన పడకుండా కాపాడరా నాయనా" అని చిదంబరం గడ్డం పట్టుకున్నాడు.

చిదంబరం చిద్విలాసంగా నవ్వేడు. "నా పాలసీ తెలుసుకదా – ధైర్యే సాహసేలక్ష్మీ అంతే"

శేఖరం "మమ్మల్నిలా బతకనీరా చిదంబరం" అంటూ రెండు అరచేతులూ తట్టూ వందనం భంగిమ పెట్టాడు. చెదరని చిరునవ్వుతో ఆయనకో కటాక్షవీక్షణం యిచ్చాడు చిదంబరం.

"నువ్విలా పట్టుబడితే మేమీ ప్రపోజల్ బుట్టదాఖలు చేసుకుంటాం. జనం చస్తే చావనీ" బెదిరించాడు సెక్రటరీ రామారావ్. "జనం చావరు. మన వీపు పచ్చడిచేస్తారు" అన్నాడు అధ్యక్షుడు మణ్యాం.

తర్జన భర్జన చాలాసేపు సాగింది. సభ్యులంతా మల్లగుల్లాలు పడ్డారు. మీటింగ్ వాయిదా పడింది. పోయి పోయి ఈ ఐరన్ హ్యాండ్‌కి మెంబర్‌షిప్పేమిట్రా బాబూ" అనుకుంటూనూ, "అయ్య చెయ్యి పెట్టాడంటే మటాష్. చాలా జాగ్రత్తగా ఉండాలి" అంటూనూ బయటకి కదిలారు సభ్యులు. కొందరైతే చిదంబరం మీది కినుకని దేశం మీదకి మళ్లించి, "ఇట్టాంటి ప్రబుద్ధులే దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నది" అని పొంతన లేని కోపం ప్రదర్శనం చేశారు. అందరూ హతాశులై, చప్పబడిపోయారు.

ఇంతకీ ఏమిటీ చిదంబర రహస్యం? 'శరీరమాంద్యం' పామెతని వంటబట్టించుకున్న ఘనుడు చిదంబరం. ఆశయాలూ, ఆశలూ, భేషజాలూ ఏమీలేవు. భార్య బాలాంబ చేత తీరుతీరుగా పూటకి నాలుగురకాల పచ్చళ్ళతో భోజనం లాగించటం, తీరుబడి అయినప్పుడల్లా డబ్బా టిఫిన్‌లు లాగిస్తూ రుబ్బుడు మిషన్‌లా

నోరాడించటం – అంతే. ఈ దవడక్రియని స్పెషలైజ్ చేసేవాడు. ముద్దుగా కొంతమంది సహోద్యోగులు 'గణపతిమాష్టర్' అని పిలుచుకునేవారు.

ఉద్యోగంలో చేరిన పదేళ్ళకి ప్రమోషన్ పరీక్షకి కట్టే 'విపరీతబుద్ధి' పుట్టింది చిదంబరంకి. ప్రమోషన్ పరీక్షనే రద్దు చేసేశారు యాజమాన్యం. మా వంశంలో అందరికీ ఏడేడు తరాల ఆడపిల్లలే ఆనవాయితీ. నాకు మాత్రం మగపిల్లాడు ఖాయం' అనుకున్నాడు. అనుకుంటే పోయే, పోనీ భార్యతో అన్నా పోయె; పోయి పోయి మిత్రులతో పందేలు పెట్టేడు. ఆడపిల్ల పుట్టింది. బతుకంటేనే విరక్తి కలిగింది. ఆ విరక్తి ఫలితంగా ఏడాది కల్లా ఇంకోటీ ఆడపిల్లే తయారైంది. పాపం బాలాంబ – భర్త తిట్టుపోతలకి దుఃఖాంబ అయిపోయింది. అప్పుడప్పుడూ ఏకంగా రోదాంబ అయ్యేది!

ఏదో సందర్భంలో ఆఫీస్ మీద కోపమొచ్చి ఇన్‌స్పెక్షన్‌కి మార్చమని రిక్వెస్ట్ ఇచ్చాడు చిదంబరం. ఇన్‌స్పెక్షన్ విభాగంను తీసుకుపోయి ఆడిట్‌లో కలిపేశారు. ఇతినికి అందులో చేరే అర్హత లేదన్నారు. అంతకు ముందు ఇన్‌స్పెక్షన్ విభాగంలో చేస్తున్న వాళ్ళని దేశాంతరాలూ, శంకరగిరి మాణ్యాలూ పట్టించారు. చిదంబరం పేరు ఖండఖండాలుగా ప్రసిద్ధి చెందింది. ఈ దారుణానికంతటికీ అతని రిక్వెస్టే కారణమని!

అప్పుడు రాఘవన్ వచ్చాడు. అతని స్నేహం కుదిరింది చిదంబరంకి. తత్ఫలితంగా బుర్ర స్పీడందుకుంది. షేర్ల వ్యాపారంలో లకారాలు చూస్తున్నాడు రాఘవన్. చిదంబరంకి పురెక్కించాడు. ఇక ఇతనికి కలలే కలలు! కళ్ళముందు టెక్నికలర్ సినిమా కనిపించింది. అన్నీ అంకెలూ, గుణింతాలే. బాలాంబకి చెప్పాడు. ఆమె 'ఊఁహూఁహూఁ' అని వొణికింది. వద్దని గునిసింది. నేనొప్పుకోనని కోపగృహం అనబడే వసారాలో పిల్లల చాపమీదకి చేరింది. చిదంబరం బతిమాలాడు బుజ్జగించాడు. భంగపెట్టాడు. ఒకటిరెండు ఎక్స్‌ట్రా ముద్దులిచ్చాడు. కళ్ళల్లో కళ్ళెట్టి "నా బంగారు కదూ. నీ బంగారం ఇచ్చెయ్. నిన్ను బంగారంలో ముంచి తేలుస్తా'నని చిబుకమెత్తి మరీ ప్రాధేయపడ్డాడు. కొంగు పట్టుకుని అడ్డదిడ్డంగా తిరిగాడు. ఆడపిల్లలిద్దరికంట పడబోయే సమయానికి "ఛా ..ఛా.. ఏమిటండీ ఇది... పిల్లలు.జ. పిల్లలు..." అని బాలాంబ గోముగా కోప్పడి కొంగులాగేసుకుంది. ఆమేమీ అంత తేలిగ్గా ఊఁ అనలేదు. దేవదాసు పోజెట్టాడు. "నువ్వాదుకోక బోతే మనం

గొప్పవాళ్ళమెట్టా అవుతా"మని గద్దించాడు. ఆమె చాలా తాపీగా "ఇట్టా ఉందాం లెండి" అన్నది. చిదంబరం చిత్తాహంకారాలు కుతకుతలాడిపోయాయి.

"ఇద్దర్నీ ఆడపిల్లల్నే కని చచ్చావ్. గుర్తుంచుకో" అని నిష్ఠూరమాడాడు. "ఈసారి మగపిల్లవాడే ఖాయం లెండి. నాకు తెలుస్తోంది" అంది సిగ్గుపడుతూ. అప్పుడేనా మళ్ళీ అని అవాక్కయ్యాడు చిదంబరం.

రోజులు గడవనీయకుండా బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. 'నువ్విట్టా మొండికేస్తే నాకు ఆత్మహత్యే శరణ్యం. అక్కడ లక్షల్లో లాభం కాస్తా కళ్ళముందు జారిపోతుంది" అన్నాడు.

పాపం ఆ రాత్రి బాలాంబ ఫక్తు పతివ్రతయిపోయింది. తెల్లవారు ఝామునే మంగళసూత్రాన్ని కళ్ళకద్దుకుని తీసి పసుపుతాడు ధరించింది. దాని తోబుట్టువులా ఉన్న రెండుపేటల బొట్ల గొలుసునీ భద్రంగా తీసి చిదంబరం చేతుల్లో పెట్టేసింది. ప్రతిఫలంగా 'మాబాల బంగారు తల్లి" సర్టిఫికెట్టూ, దానికి అనుబంధంగా మరీషూ... ట్టి... ముద్దూ అందుకుంది. మురిసి మురిసి ఇంటిముందు ముగ్గేయడానికెళ్ళింది. చిదంబరం పోయి పోయి సరాసరి రాఘవన్ నమ్మకానికి తన తెలివిని అమ్మకం చేసుకున్నాడు.

పరమపద సోపానపటంలో ఆట మొదలైంది. నిచ్చెన ఎక్కటం, పామునోట్లో పడటం, జారుడుమెట్ల ఎగదీత, దిగతీత! ఇరవైవేలకి చేరిన సెన్సెక్స్‌కి మరీ తొందరెక్కువై, జారుడుతనం అబ్బింది. 'లాంగ్‌రన్'లో ఫర్వాలేదన్నాడు రాఘవన్. కొమ్ములు దిరిగిన అర్థిక వేత్తల్ని కోట్ చేశాడు. వాళ్ళ కొటేషన్స్‌కీ వ్యూస్ పేపర్ల న్యూసూ చూపించాడు.

చిదంబరం అరుకాసురుడు - పెద్దపాము - నోట్లో పడిపోయాడు. కుదేలైపోయాడు. 'బ్యాడ్‌లక్' అన్నాడు రాఘవన్. 'అదృష్టం' అంటేనే కనిపించనిది కదరా వెధవా' అన్న ఎలిమెంటరీ స్కూలు టీచర్ వెంకటేశ్వర్లుగారి విసురు వినిపించింది.

నిజంగా ఏడుపొచ్చింది చిదంబరంకి. కానీ, బహిరంగంగా - మనసారా ఏడ్వనీయలేదు. ఆఫీస్‌లో మిత్రులూ, ఇంట్లో భార్యా! మాసినగడ్డం, మార్చని గుడ్డలూ - కథనంతా లోకానికి చెప్పేసినై!

సర్వమూ కోల్పోయిన రాజరాజ కథయిపోయింది చిదంబరం పరిస్థితి. వేసిందే ఒక గంతు.. అన్నట్లయింది! వ్రేళ్ళు కాలినై! మార్కెట్ సెంటిమెంట్ అంతే అన్నాడు రాఘవన్!

ఇదిగో ఇదీ – గతమెంతో ఘనకీర్తి కలవాని – మటాష్ కథ! కొత్తగా ఏర్పడబోతున్న హౌసింగ్ సొసైటీలో సభ్యత్వం ఇవ్వమని మిత్రులు విముఖత చూపటానికి ఇదీ కారణం. చిదంబరం మెంబరయితే సొసైటీ పుట్టి మునుగుతుందేమోననే భయం, అనుమానం, సందేహం.

చిదంబరమేమో 'ధైర్యే సాహసే లక్ష్మి' అంటున్నాడు. "నిండా మునిగిన వాడికి చలేమిటి?" అని గద్దించాడు. "నీకు చలి లేదు నాయనా, మాకు నువ్వంటే వణుకు" అన్నారు మిత్రులు. "రెండేళ్ళలో ఈ సైట్లు నాలుగింతలు పెరుగుతయ్" అన్నాడతను. "నీకా ధైర్యం ఉంది కనుకనే మాకీ భయం" అన్నాడు వెంకట్రావ్. 'ఏది ఏమైనా నాకు కావాలి. డబ్బు కట్టాల్సింది ఇన్‌స్టాల్‌మెంట్స్‌లోనే గదా. కట్తాను. నా పిఎఫ్‌లోనూ, సొసైటీలోనూ వున్నై" అన్నాడు చిదంబరం. "వద్దురా బాబూ" అని సామూహికంగా అతని ముందు మోకరిల్లారు సభ్యులంతా.

చిదంబరం చలించలేదు. సభ్యులకి గత్యంతరం లేకపోయింది. రాజీ ఫార్ములా తెరమీదికొచ్చింది. బాలాంబ పేరుమీద సభ్యత్వం ఇచ్చారు. హౌసింగ్ సొసైటీ మొదలైంది. ఎట్టకేలకు సైట్ రిజిస్ట్రేషన్లూ అయిపోయినై.

రెండేళ్ళు ఇట్టే తిరిగివచ్చాయి.

చిదంబరంకి ముచ్చటగా మూడో ఆడపిల్ల వచ్చింది.

ఇదిగో, ఇవ్వాళ ఊరు ఊరంతా పెరిగిపోయింది. మూడు పిజ్జాలూ ఆరు బర్గర్లుగా... అన్‌వీల్డీగా పెరిగిపోయింది. వీళ్ల లేఅవుట్ ఉత్తరాన ఉంటే, ఊరు ఆవల ఈవల మూడు దిక్కులా డెవలప్‌మెంటే. ఉత్తరాన మాత్రం కనుచూపుమేర – రాళ్ళూ, గుట్టలూ, ఊసరక్షేత్రాలూ! ఏ సైట్‌ని తెగనమ్ముకుందామన్నా సగం ధరకు కొనే నాథుడు కూడా కరువయ్యాడు.

బాలాంబ పేరున సభ్యత్వం ఇచ్చినా, చిదంబరం ప్రభావం చిదంబరం ప్రభావంగానే – 'మటాష్' స్థితిని – చూపిందని పెద్దలూ, వారివారి (సారీ ఎవరివారి వారి) భార్యలూ వాపోతున్నారు. ఆమె వైఫ్ ఆఫ్ చిదంబరం కదామరి! సభ్యులంతా కలిసి మూకుమ్మడి నిరసనలూ, చిరాకులూ చిదంబరంకి చూపేరు. అంతా కలిసి ఒక్కటై ఆ స్థలంలో శాంతి యజ్ఞమూ జరిపించారు. ఖర్చు మిగిలింది! అందరూ

చిక్కి పోయేవున్నారు కదా ఈ చక్రబంధంలో. ఇప్పుడు దిగులుతో మరింత చిక్కిపోయారు. చిక్కి సగమో పావో అయిపోయారు!

ఉన్నట్టుండి - నిద్రలేని ఓ అర్థరాత్రి,

శేఖరంకో ఆలోచన వచ్చింది.

రెండేళ్ళకి సైట్ విలువ నాలుగింతలవుతుందనే ఆశతో కదా చిదంబరం ఈ సైట్‌తీసింది?! అంత సొమ్మూ అతనికిచ్చేసి ఆ సైట్ తీసేసుకుంటే..?

తగ్గింది మందు అన్నట్టు, వెంట వెంటనే ఆలోచన ఆచరణ రూపం వచ్చేసింది. స్థలం యజమాని బాలాంబ తానుగా ఎగిరి గంతేయకుండా అప్పుడే రజస్వల అయిన పెద్దకూతురి చేత గంతేయించింది! (తిరకాసునేమీ చూడకండి. జస్ట్ కాసులకోసం అంతే పాపం. ఉత్తమ ఇల్లాలు కదా ఆమె!)

బాలాంబ స్థలం శేఖరం కొనేశాడు. జస్ట్ - సెంటిమెంట్! ఆర్నెల్లయింది.

ఇప్పుడే అందిన వార్త. ఈ లే అవుట్‌కి అల్లంత దూరంలో విమానాశ్రయం మంజూరైంది.

ఇప్పుడు శేఖరం ఫోన్ బిజీగా వుంది. బిల్డరెవరో మాట్లాడుతున్నాడు!

–చినుకు మాసపత్రిక, డిశంబర్ 2010